ప్రేమించే భర్త
ముద్దొచ్చే పిల్లలతో
హాయిగా వున్న
ఆ ఇల్లాలిలోని
అసంతృప్తికి కారణం!

# గుండెలో ఆకలి

గంటి
రమాదేవి
కథ

వెండిగిన్నెలో మల్లెమాలలా, ఆ పాలరాతి మేడలో, పాలనురుగు చీరెలో మెరిసిపోతూ పరిమళ...

మల్లెపూలలో బంగారు కణికెలా పరిమళ మేనిఛాయ పచ్చగా తళుకులీనుతూ...

అడవిలో హాయిగా పాడుకునే నైటింగేల్ రెక్కల నల్లదనం ఆమె కుటిలకుంతలాలది.

భ్రమల నాదానికి మాత్రమే పులకించే సరోజవనంలా విరిసీ విరియని తామర రేకులామె కళ్లు.

ఆమె భర్త జగన్నాథరాయలు.

పేరు పాతదవ్వచ్చు. రూపం అధునాతనం. ఎమరాల్డ్ సూటింగ్‌లో హుందాగా, విందుగా వున్నాడు.

అతనికున్న వ్యాపార వ్యవహారాలకు ఉక్కిరిబిక్కిరి అవవలసింది ఇంకొకరయితే. క్రీమ్ కలర్ 1600 సిసి హోండా అతి తేలికగా నడిపినట్టే సునాయాసంగా కోట్ల రూపాయల వ్యాపారాన్ని చక్కగా బేలన్స్ చేస్తూ నడపగలడు.

ఇద్దరు పిల్లలు... రాహుల్, బ్రహ్మణి,

ఊటీలో అండర్ 10లో చదువుతున్నారు.

రాయలు హుందాతనం, పరిమళ అందం ఇద్దరూ సమంగా పంచుకున్నారు.

సెవెంత్ డే క్రాస్ స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ అంటుంది — రాహుల్ బ్రహ్మణిల గురించి — "వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ దెమ్ — మోర్ ప్రౌడ్ దేన్ బోత్ ఆఫ్ యూ పేరెంట్స్!"

జగన్నాథరాయలు చాలా సమయం పరిమళతోనే వుంటాడు...



ఇన్నివ్యాపారాలు చూసుకుంటూ, అంత లీజర్‌గావుండడం రాయలుకే చేతనవును.

పరిమళకు ఆమాత్రం పనికూడాలేదు.

ప్రొద్దున్న బ్రేక్‌ఫాస్ట్ ఐటమ్స్ సెలక్ట్ చేయడం—

వంటమనిషికి పురమాయించడం.

స్నానానికి ఏ పెర్‌ఫ్యూమ్‌ సబ్బు వాడడం, అన్నది నిర్ణయించుకోవడం. వందల

చీరెలలో ఏదో చీరె సెలక్టు చేసుకోవడం. కొత్తవి ఆర్డర్ ఇవ్వడం. నగలు పెట్టుకోవడం — వచ్చినవి విత్ స్టోన్స్ — వితవుట్ —

వివిధ మాస, వార, దినపత్రికలు తిరగెయ్యడం... విసుగెత్తినప్పుడు టీవీ — టీవీ విసుగెత్తినప్పుడు వి.సి.ఆర్ వేసుకుని కొత్త కేసెట్స్ చూడడం — మళ్లీ విసుగెత్తితే మేగజైన్స్ — ఇదే దినచర్య—

రాయలు పరిమళకేసి నవ్వుతూ చూశాడు.

"మన 'పెట్రో కెమికల్స్' ప్రాజెక్టుకు అనుమతి వచ్చింది. కొలాబరేటర్స్‌తో రాత్రి 'టాజ్ ప్రెసిడెన్సీ'లో డిన్నర్ — పరిమళా నువ్వూ రాకూడదూ?"

పరిమళ నవ్వింది. తళుక్కున మెరిసింది హాలు.

"ఎందుకో డల్‌గా వుంది — మీరు వెళ్లండి"

"ఓకే — నీ ఇష్టం. ఆ... ఫ్రాన్స్‌నుండి "జె ఫేస్" ఎక్స్‌ట్రాక్ట్ పెర్ఫ్యూమ్ తెచ్చాడు. చిన్న సీసా ఆరు వందల డాలర్లు — అది నీగురించి తెప్పించాను...."

కోటు జేబులోనుంచి తీసిచ్చాడు...

"ఓగాడ్ ఆరువందల డాలర్లు ఖరీదే — థాంక్యూ — థాంక్యూ — నాకోసం తెప్పించినదానికి" అని తీసుకుని సోఫాలో పక్కన పెట్టుకుంది.

"పరిమళా! నీకు తెలుసా — మన పెట్రో ప్రాజెక్టు వస్తే, మనం నెంబర్ త్రీ ఇండస్ట్రియలిస్ట్ — దేశంలో — మూడేళ్లపాటు నష్టాలొస్తాయి. నాలుగో సంవత్సరంనుండి లాభాలే — కోట్లలో. ఆ అన్నట్టు రాహుల్ — బ్రహ్మాణిలనుండి ఉత్తరం వచ్చింది. చాలా బాగా చదువుతున్నార్ట. పాపం — పసి వెధవలు — ఈ వేసవిలో స్విట్జర్లాండ్ తీసుకువెళ్లడానికి ప్లాన్ చేస్తున్నాము — మన నలుగురికీ టిక్కెట్లు, ఎకామెడేషన్, సైట్ సీయింగ్ ఎరేంజ్ చెయ్యమని ట్రావెల్ ఏజంట్‌కు చెప్పాను... ఇదిగో ప్రిన్సిపాల్ రాసిన ఉత్తరం —"

రాయలు వెళ్లిపోయాడు సాయంత్రం వస్తానంటూ.

నెమ్మదిగా లేచింది పరిమళ.

అతి ఖరీదైన సెంటు సీసా చేతిలోకి తీసుకుంది. బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. బాటిల్ ఓపెన్‌చేసి వాష్‌బేసిన్‌లో పోసింది.

మొత్తం బాటిల్ వంచేసింది.

అత్యంత ఖరీదైన సెంట్!

తర్వాత — రాహుల్, బ్రహ్మణి ప్రిన్సిపాల్ రాసిన ఉత్తరం చదివింది.

"ప్రిన్సిపాల్ రాహుల్, బ్రహ్మణి మెంటల్ ఎక్యుమన్‌ను పొగుడుతూ రాసింది..."

సీసా పూర్తిగా ఖాళీ అయింది. గదంతా మత్తెక్కించే సువాసన.

సీసాను నేలకేసి కసిగా కొట్టింది. "చావు చావు" అంది.

రాహుల్, బ్రహ్మణిల లెటర్ ముక్కలు ముక్కలు చేసి డస్ట్‌బిన్‌లో పడేసింది.

"ఎందుకు అన్ని తెలివితేటలు — వెధవ పిల్లలు — ఫేలయిపోయి ఇంటికి వాపసు రావచ్చుగా"

ఆమె మనసు ఒక్క క్షణం ఊహల్లో తేలియాడింది.

రాహుల్‌కు లెక్కలు రావు. ప్రతి పరీక్షలో ఫెయిల్ — బ్రహ్మణికి ఇంగ్లీషురాదు. వట్టి మొద్దు. పరీక్షలు బాగా రాయనం

దుకు ఆమె వాళ్లను కొడుతుంది. వాళ్లు ఏడుస్తూ అరుస్తారు. "ఇంకెప్పుడూ ఇలా చెయ్యం — కొట్టకు మమ్మీ" అంటూ మళ్లీ వచ్చే పరీక్షల్లో ఇదే తంతు...

సన్నటి చిరునవ్వు ఆమె ముఖంలో!!

వాస్తవంలోకి వచ్చిన ఆమె మనస్సు చివుక్కుమంది.

ఈ పెంటు పీసా ఇలా వేలపాలు చేసినందుకు రాయలు తనని కొడ్తాడా? ఊహు — అంత అదృష్టమా!

ఇదివరకెన్నోసార్లు చూసింది — రాయలు తనని కోపగించుకోడు. ఎప్పుడూ కొట్టడు.

"భగవాన్ — మా ఆయన నన్ను చితక్కొట్టేలా చూడు!"

"మా పిల్లలు బదుద్దాయిలయ్యేట్టు కరుణించు!!!"

"మా వ్యాపారాలు దెబ్బతినేటట్లు, నష్టాలువచ్చేటట్టు, ఈ ఐశ్వర్యం గంగలో కలిసేట్టు చెయ్యవూ" మౌనంగా ప్రార్థించింది పరిమళ.

"అమ్మా! అన్నం వడ్డించమంటారా?" వంటమనిషి ప్రతిరోజూ అడిగే మాట.

"మవ్వేళ్లు! నే పెట్టుకుంటాలే" పరిమళ అంటుంది అలవాటుగా.

సాయంత్రం, వండినది వండినట్టే వుంటుంది. వంటావిడ అవి తీసుకుపోతుంది.

"ఏమే! నిన్ను మీ ఆయన కొడతాడా?"

మేఘంలేని పిడుగులాంటి ఆ మాటకు ఉలిక్కిపడింది వంటమనిషి.

వారానికో, నెలకో ఆవిడ మొగుడిచేతిలో వాయింపు తప్పదు. ఆర్థిక బాధలు. సంపాదించినది చాలదు — ఆరుగురు పిల్లలు — వాళ్ల ఖర్చులు"

"లేదమ్మగారూ"అంది సిగ్గుపడుతూ.

"నిజం చెప్పు— పెళ్లాన్ని కొట్టని మగాడు ఎక్కడోగాని వుండడంటారు" నిరాశగా అంది పరిమళ.

వంటమనిషి పరిమళను నిరాశపరచడం

## అమెరికా అమ్మాయిలు

అమెరికాలో ప్రతి సంవత్సరం 90 శాతంమంది అమ్మాయిలు (19 సంవత్సరాలలోపువారే) 15 లక్షలకు పైగా గర్భిణీలవుతున్నారట! వారికోసం 22 సంవత్సరాలనుంచి ఒక స్కూలు నడుపుతున్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, పిల్లల పోషణ, చేతిపనులగూర్చి తెలుపుతారు.



— అచ్యుతుని రాజ్యశ్రీ

ఇష్టం లకపోయింది.

''వారానికో, నెలకో చావబాదుతాడమ్మా — ఒక్కోసారి అకారణంగా''

పరిమళ ముఖంలో వెలుగు—

''నువ్వు తిరిగి కొడతావా?''

''వావల్ల ఏమవుతుందమ్మా — మొగుడు కొట్టినా, తిట్టినా పడాలి — తాళికట్టిన తర్వాత అది దేముడి నిర్ణయం''

''సరే — ఇక పో—''

వంటమనిషి వెళ్లిపోయింది.

రాయలు సాయంత్రంగాని రాడు.

అత్యాధునిక సువిశాల సౌధం ఆమెది.

అయినా కాలు మెదపలేని ఇరుకు అనుభవిస్తోంది.

అతిఖరీదైన, రుచికరమైన, వైవిధ్యం వున్న భక్ష్య బోజ్యాలు కంటికెదురుగా!

అయినా ఆమె ఆకలి తీరదు.

ధన కనక వస్తు వాహనాలు సమృద్ధిగా వున్నాయి.

అయినా కటిక దరిద్రం అనుభవిస్తోంది ఆమె.

వాష్ బేసిన్‌లో పోసిన సువాసనల పిచికల్తోపాటు, ఆమెలో ఆకలి కోరిక పెరుగుతోంది.

అన్నంతో తీరే క్షుదార్ది కాదది! ఐశ్వర్యంలో కటిక దారిద్ర్యం.

సమృద్ధిలో ఆకలి!!

విశాలంలో ఇరుకుతనం!!!

తృప్తితో మొఖంమొత్తి అసంతృప్తిచెంది, అసంతృప్తితో తృప్తి పొందాలని, ఎండమావిని చూసి పరుగెత్తేమనిషిలోని ఆరాటం.

పగలే వెలుగులు చిమ్ముతున్న దీపాలవైపు చూస్తూ అనుకుంది పరిమళ.

''ఈ లైట్లారిపోయి చీకటి రాదేం — ఎక్కడ చూసినా వెలుగు — వెలుగు — వెధ వెలుగు.

హఠాత్తుగా కోపం వచ్చిందామెకు.

ఏదీ చీకటి? ఎక్కడ కష్టం! రాయలు ఎందుకు కొట్టడు అందరు మొగుళ్లలా!

పిల్లలు బదుద్దాయిల్లా తయారవ్వరేం!!

రాయల్ని టాక్సువాళ్ల పట్టుకుని జైల్లో పెట్టాలి—

ఈ ఆస్తంతా ఎవరో లాగేసుకోవాలి.

తనూ ఆ వంటమనిషిలా లావుగా, ముతకచీరెలో—

ఎంత హాయి!!

ఫ్రిజ్ తీసింది!!

తాజా పళ్లు ఎన్నో!

మామిడి! యాపిల్! సపోటా! అరటిపళ్లు!!

ఛీ!ఛీ ఇవేమిటి బాంబుల్లా! ఇవి పేలాలి! ఇల్లు కూలిపోవాలి—

ఏ.సి చిన్న శబ్దం చేస్తూ పనిచేస్తూ వుంది.

విపరీతమైన వేడిగాలి — ఛీఛీ ఇక్కడ సుఖంలేదు.

ఆపుచేసింది.

పడక గదిలోకి వెళ్లింది.

శుభ్రమైన దుప్పటి కప్పిన పరుపు. మెత్తటి పరుపు.

దాన్ని తాకింది పరిమళ.

ఇదేమిటీ పురుగులా — పాములా — మెత్తగా!

అల్మారా తెరిచింది.

ఎన్నో బంగారు నగలు. కెంపు, గోమేధికం, రత్నం, మరకతాలు, పుష్యరాగాలు —

విలువైన రాళ్లు.

ఎన్నో వందల నోట్లు.

అవన్నీ తీసి నేలమీద పోసింది.

వంటిన కట్టిన ఖరీదైన చీర పీకేసింది.

మందంగా బరువుగా వున్న తెరలను చింపింది.

అవి వంటికి చుట్టుకుంది.

ఎంతో సుఖంగా వున్నాయా బట్టలు.

తనకింకా సుఖం కావాలి.

మొగుడు చంపడేం — కనీసం కొట్టడేం.

ఏదీ ఆకలి! ఏడుపు దొరకుతుందా?

కొనుక్కుంటూ! ఏడుపు దొరుకుతుందా?

వంటింట్లోకి వెళ్లింది.

గ్యాసుపొయ్యిఆర్పి చాలాసేపే అయింది. ఇంకా వేడి తగ్గలేదు.

పరిమళ తన పట్టులాంటి చెయ్యి దానిమీద పెట్టింది.

హాయిగా వుంది.

ఆ హాయి ఇంకా కావాలి...

గ్యాసువాసన సన్నగా. ఎంత బాగుంది — గ్రేట్ పెర్ఫ్యూమ్—

గ్యాసు ఓపెన్ చేసింది!

ఎంత సురభిళం!

గుండెలనిండా పీల్చుకుంది—

ఇదేనా సుఖమంటే! హాయంటే — గ్యాసు నిండుతోంది గదంతా—

నాసిక తృప్తిపడింది. మరి శరీరం — వెచ్చగా కావాలి.

అగ్గిపుల్ల తీసింది!

గబుక్కున వెలిగించింది.

... ... ...


... ... ...

ఆహా ఇదే అమర సుఖం — శాశ్వత సుఖం.

ఆమె తాదాత్మ్యం చెందుతోంది...

అనిర్వచనీయం — అప్రమేయం —

తనిన్నాళ్లూ ఎదురుచూసింది దీనికోసమే —



ఇన్నాళ్ళూ ఎందుకు తట్టలేదు —

ఇప్పుడు జగన్నాథం కొట్టకపోయినా ఫర్వాలేదు.

పిల్లలు — వెధవలు — అల్లరి చెయ్యకపోయినా ఫర్వాలేదు.

ఎంత బాగుంది — ఈ సమాధి స్థితి...

○ ● ○

రాయలు సాయంత్రం అన్న టైముకే వచ్చాడు.

బంగారంలాటి పరిమళ బొగ్గు కణికలా మారింది! ఎందుకిలా? ఏమైంది పరిమళకు! ఏం తక్కువైంది ఈమెకు? దుఃఖంతో మాట రావడంలేదు.

ఈమెకు ఒంటరితనంలేదు— ప్రేమాభిమానాలు పుష్కలంగానే వున్నాయి మరి?

రాయలకు ఒక విషయం తెలీదు.

శారీరక అసంతృప్తి వాస్తవం — ఆకలి ఆహారంవల్ల తీరుతుంది. నిద్ర నిద్రించడం ద్వారా — శారీరక సుఖం — ఆశ పుట్టినట్టు పుట్టి తృప్తిచెంది, సమసిపోయి మరలా మొగ్గలా మొలిచి, మళ్లీ తృప్తిచెంది — నిరంతరం వలయంలా తిరుగుతూ, అన్వేషిస్తూ, చైతన్య, సుషుప్తావస్థలకు గురవుతూ వుంటుంది.

పసిపిల్లలు, తియ్యటి వెచ్చటి పాలు త్రాగి, ఇముడ్చుకోలేక కక్కుతూ వుంటారు. వయసు పెరిగేకొద్దీ ఆ నేర్పు స్వతహాగా అలవడుతుంది. ఇముడ్చుకోగలుగుతారు.

పరిమితులకు లోబడి పదార్థం ఇచ్చిన తృప్తినీ, సుఖాన్నీ ఇముడ్చుకోలేక, రోజాపువ్వు చేతికిస్తే, 'కాక్టస్' కావాలనీ, అమృతభాండం చేతికిస్తే విషపుగిన్నె కావాలని మారాం చేసే పరిమళకూ, పసిపిల్లలకూ పెద్ద తేడా లేదు. ●

